తెలంగాణ బిడ్డలకు సీఎం క్షమాపణ చెప్పాలి

కేటీఆర్ డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణ బిడ్డల స్థానికతను ప్రశ్నార్థకం చేసిన సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థుల అడ్మిషన్ల విషయంలో ప్రభుత్వం ఇంకా మొద్దు నిద్ర ప్రదర్శిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అనాలోచితంగా తెచ్చిన జీవో 33పై ప్రతిష్ఠంభన నెలకొన్నదని విమర్శించారు. ఇతర రాష్ట్రాల్లో మెడికల్ అడ్మిషన్ల ప్రక్రియ చివరి దశకు చేరినా రాష్ట్రంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొన్నదని పేర్కొన్నారు. అక్టోబర్ 31లోపు అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేయకపోతే విద్యార్థులకు తీరని నష్టం జరుగుతుందన్న సోయి కూడా కాంగ్రెస్ సర్కారుకు లేకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య విద్యార్థుల అడ్మిషన్ల విషయంలో కాంగ్రెస్ సర్కారు క్షమించరాని నేరం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కండ్లు తెరిచి అడ్మిషన్ల ప్రక్రియను యుద్ధప్రాతిపదికన చేపట్టి నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే అడ్మిషన్ల ప్రక్రియను అస్తవ్యస్తం చేసిందని ధ్వజమెత్తారు. అనాచితంగా, అనవసరంగా తెచ్చిన జీవో 33పై విద్యార్థులకు సీఎం క్షమాపణ చెప్పాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్య వైఖరి వల్ల ఒక్క విద్యార్థికి నష్టం జరిగినా బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

దొంగలు పడ్డ ఆరు నెలలకు

అమృత్ పథకం టెండర్ల అవినీతిపై కేంద్రమంత్రి బండి సంజయ్ స్పందన 'దొంగలు పడ్డ ఆరు నెలలకు..' అన్నట్టు ఉన్నదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఎక్స్‌వేదికగా బండికి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బండి సంజయ్ హోం శాఖ మంత్రి అన్న విషయాన్నీ మరచారని ఎద్దేవా చేశారు. అమృత్ స్కీంలో అవినీతి జరిగిందని బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మొత్తుకుంటే బండి సంజయ్ పాలు తాగుతున్న దొంగపిల్లిలా కన్వీనియంట్‌గా కండ్లు మూసుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని అన్ని విధాలా వెనుకేసుకొస్తున్న బీజేపీ తీరును, కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారనే విషయం గుర్తుంచుకోవాలని సూచించారు.

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో సబితా ఇంద్రారెడ్డి, మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

కేసీఆర్ విజన్‌తోనే అభివృద్ధి

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో కేసీఆర్ విజన్‌తోనే అభివృద్ధి సాధ్యమైందని తెలిపారు. రాష్ట్రమంతా కేసీఆర్ నాయకత్వం కావాలని ప్రజలకు కోరుకుంటున్నారని అన్నారు. హైడ్రా బాధితులు ఏడుస్తున్నారని, పేద వారిని పగబట్టినట్టుగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, బీఆర్ఎస్ నే త పీ కార్తీక్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబా, నాగేందరగౌడ్, కార్పొరేటర్లు సింధుఆదర్శ్‌రెడ్డి, జూపల్లి సత్యనారాయణ, పురుషోత్తం యాదవ్, రవియాదవ్, హరీశ్, కిరణ్‌యాదవ్ పాల్గొన్నారు.

ఓట్లేయలేదనే కూల్చివేతలు

"ప్రభుత్వానికి దమ్ముంటే ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న పట్నం మహేందర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీల ఇండ్లు, ఫామ్‌హౌస్‌లు కూలగొట్టాలి. పేదలకు ఎవరూ అండగా లేరని వారిపై దౌర్జన్యాలు చేస్తారా?

-కేటీఆర్

మొదటిపేజీ తరువాయి...

నోటీసు ఇచ్చినట్టు డ్రామా ఆడి స్టే తెచ్చుకునేటట్టు చేశారని పేర్కొన్నారు. కానీ, గరీబోళ్ల సామాన్లు, పుస్తకాలు తీసుకుంటామంటే మాత్రం వారికి సమయం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ కన్‌స్ట్రక్షన్ చేస్తే ఈయన (రేవంత్‌రెడ్డి) డిస్ట్రక్షన్ చేస్తున్నాడని విమర్శించారు. తాము డబుల్ బెడ్రూంలు, ఫ్లై ఓవర్లు, ఎస్టీపీలు కడితే ముఖ్యమంత్రి 9 నెలల్లో బెదిరింపులు, కూలగొట్టుడు, బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని మండిపడ్డారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రూ. 12వేల కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేశామని గుర్తుచేశారు.

తిరుపతిరెడ్డీ.. ఆ కిటుకేందో పేదలకు చెప్పు

'**అనుముల** తిరుపతిరెడ్డి గారు.. ఎల్‌కేజీ చదివే వేదశ్రీకి తన పుస్తకాలు తీసుకునే సమయం కూడా హైడ్రా ఇవ్వలేదు. 50 ఏండ్ల కస్తూరిబాయి తన జీవనాధారమైన చెప్పుల దుకాణం కోల్పోయింది. 72 గంటల క్రితమే కొన్న ఇల్లు నేలమట్టమైంది. వారం ముందు గృహ ప్రవేశం చేసుకున్న ఇల్లు అన్ని కాగితాలు ఉన్నా పేక మేడలా కూలింది. తిరుపతిరెడ్డి గారు.. క్షణం కూడా సమయం ఇచ్చే ప్రసక్తే లేదన్న హైడ్రా మీ విషయంలో నోరు మెదపలేదు. వాల్టా అనుకుంటా.. ఏకంగా మీకు 30 రోజుల టైం ఇచ్చింది. కోర్టులో స్టే సంపాదించుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న కూల్చివేతల రావణకాష్టంలో మట్టి కూడా అంటనిది బహుశా మీకు మాత్రమేనేమో! మీ సోదరుడి బుల్డోజర్ల కింద నలిగిపోతున్న సామాన్యులకు ఆ కిటుకేదో చెప్పండి! నాకు తెలిసి అతీతశక్తి మీకేదైనా ఉందా? లేక ఏదైనా రహస్య ఆయుధాన్ని కలిగి ఉన్నారా అనుముల తిరుపతిరెడ్డి గారు! మీకు ఉన్న అతీంద్రియ శక్తుల గురించి పేదలకు కూడా చెప్పండి. ఇప్పటికైతే ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగమే అత్యంత శక్తివంతమైందని మేము మాత్రం బలంగా విశ్వసిస్తున్నాం' అని కేటీఆర్ ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు.

అనుమతులు ఇచ్చిన వారిపై కేసులు పెట్టాలి

సినీ నటుడు నాగార్జునకు సంబంధించిన నిర్మాణాన్ని కూల్చివేయడం మంచిదే కానీ, దానికి అనుమతులు ఇచ్చినదెవరని కేటీఆర్ ప్రశ్నించారు. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వమే దానికి అనుమతులు ఇచ్చిందని తెలిపారు. అనుమతి ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో చెరువులను మాయం చేసింది కాంగ్రెస్ కాదా? అని ప్రశ్నించారు. ఆక్రమణలను బీఆర్ఎస్ ప్రోత్సహించిందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వానికి దమ్ముంటే ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న పట్నం మహేందర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీల ఇండ్లు, ఫామ్‌హౌస్‌లు కూలగొట్టాలని సవాలు విసిరారు. పేదలకు అండగా ఉండేందుకు త్వరలోనే హైదరాబాద్ ఎమ్మెల్యేలతో మీటింగ్ పెడతామని తెలిపారు.

ఉప ఎన్నికల్లో గెలుపు పక్కా

ప్రతిపక్షంలో ఉన్నా శేరిలింగంపల్లి కార్యకర్తల్లో ఎంతో కసి కనిపిస్తున్నదని, ఇక్కడ వచ్చే ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాల్సిన అవసరం ఉన్నదని కేటీఆర్ పేర్కొన్నారు. పార్టీ ఏం తక్కువ చేసిందని పార్టీ మారావని గాంధీని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొట్టుకున్నారని మంత్రి శ్రీధర్‌బాబు అతి తెలివి ప్రదర్శిస్తున్నారని, మరి శేరిలింగంపల్లి ఎమ్మెల్యేకు కాంగ్రెస్ కండువా కప్పిందెవరని ప్రశ్నించారు. మనమూ కాదని, వారూ కాదని.. చివరికి పార్టీ మారిన ఎమ్మెల్యేల బతుకు ఎటూ కాకుండా పోయిందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇంటింటికీ తిరిగి వారి కాళ్లు పట్టుకుని పార్టీలో చేర్చుకున్న సన్నాసి ఎవరో చెప్పాలని శ్రీధర్‌బాబును ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో చేరిన 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బతుకు జూబ్లీ బస్టాండ్ అయిందని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పుతో వారికి దడ మొదలైందని తెలిపారు. అందుకే నీతి బాహ్యమైన పనులు చేస్తున్నారని, దమ్ము, ధైర్యముంటే తాము ఎమ్మెల్యేలను చేర్చుకున్నామని చెప్పాలని సవాలు విసిరారు. ఉప ఎన్నికలు రాకుం డా చేస్తున్న దిక్కుమాలిన రాజకీయాలను ప్ర జలు, ఢిల్లీ కాంగ్రెస్ నేతలు చూస్తున్నారని తెలిపారు.

"బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇంటింటికీ తిరిగి వారి కాళ్లు పట్టుకుని పార్టీలో చేర్చుకున్న సన్నాసి ఎవరో శ్రీధర్‌బాబు చెప్పాలి. కాంగ్రెస్‌లో చేరిన పదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బతుకు జూబ్లీ బస్టాండ్ అయింది. హైకోర్టు తీర్పుతో వారి గుండెల్లో దడ మొదలైంది. - కేటీఆర్

సీఎం సీటుకే భరోసా లేదు

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అవ్వాతాతల పెన్షన్‌ను రూ.4 వేలు చేస్తానని చెప్పారని, కానీ ఉన్న రెండువేలకే దిక్కులేకుండా పోయిందని కేటీఆర్ పేర్కొన్నారు. గెలిచిన మరుసటి రోజే 2 లక్షల రుణమాఫీ చేస్తానని, 49 వేల కోట్ల రుణమాఫీని రూ.12 వేల కోట్లతో సరిపెట్టే ప్రయత్నం చేసున్నాడని సీఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా అన్నాడని, కానీ అసలు సీఎం కుర్చీకే భరోసా లేని పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. ఖమ్మం బాంబో.. నల్లగొండ బాంబో.. ఏది వచ్చి మీదపడుతుందో తెలియక భయంతో బతుకుతున్నాడని పేర్కొన్నారు. ఆడపిల్లల పెండ్లికి తులం బంగారం అన్నాడని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పెండ్లి చేసుకున్న ఆడపిల్లలందరికీ బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. యువకులకు తాము ఉద్యోగాలు ఇవ్వలేదన్నట్టుగా ఒకే అబద్ధాన్ని వందలసార్లు చెప్పి యువతను నమ్మించాడని, రాహుల్‌గాంధీని అశోక్‌నగర్‌కు తీసుకొచ్చి ఏటా 2 లక్షల ఉద్యోగాలంటూ నమ్మబలికారని, కానీ బీఆర్ఎస్ ఇచ్చిన ఉద్యోగాలను తామే ఇచ్చామంటూ నోటికి వచ్చిన సంఖ్య చెబుతున్నాడని పేర్కొన్నారు. నోటిఫికేషన్ ఎప్పుడు ఇచ్చావంటే కేసీఆర్‌ను తిడుతూ దబాయించి బెదిరిస్తున్నాడని తెలిపారు.

చిట్టినాయుడు అన్నదమ్ములు ఏడుగురు మొత్తం తెలంగాణను పంచుకున్నారు. చిట్టినాయుడుకు సంబంధించిన వారంతా తెలంగాణలో స్వైరవిహారం చేస్తూ దోచుకుంటున్నారు.

-కేటీఆర్

ఎటుచూసినా కేసీఆర్ ఆనవాళ్లే

కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని మాట్లాడుతున్నారని, సచివాలయం, అంబేద్కర్ విగ్రహం, కమాండ్ కంట్రోల్ సెంటర్, 36 ఫ్లై ఓవర్లు, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి ఇలా ఎక్కడ చూసినా కేసీఆర్ ఆనవాళ్లే కనిపిస్తాయని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ ఉన్నన్ని రోజులు కేసీఆర్ కనిపిస్తూనే ఉంటాడు బాబూ చిట్టినాయుడూ అని ఎద్దేవా చేశారు. అయ్యప్ప సొసైటీలో తిరుపతిరెడ్డి ట్యాక్స్ వసూలు చేస్తున్నారని, 500 గజాలకు రూ.10 లక్షలు, 1000 గజాలకు రూ.18 లక్షలు వసూలు చేస్తున్నారని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ గతంలో చెప్పాడని గుర్తుచేశారు. తిరుపతిరెడ్డి ఆఫీసుకు వెళ్తే కమిషన్లు, సెటిల్‌మెంట్ల దందా నడిపిస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యేనే చెప్పాడని అన్నారు. చిట్టి నాయుడు అన్నదమ్ములు ఏడుగురు మొత్తం తెలంగాణను పంచుకున్నారని, చిట్టినాయుడుకు సంబంధించిన వాళ్లంతా తెలంగాణలో స్వైరవిహారం చేస్తూ దోచుకుంటున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి బంధువులు, సీఎం చేస్తున్న దౌర్జన్యాలతో తెలంగాణలో రియల్ ఎస్టేట్ ధమాల్ అన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి, ఆయన కుటుంబ సభ్యులు చేస్తున్న ఘాతుకాలు, భూదందాలు, బిల్డర్లను బెదిరించడం, హైడ్రా పేరు మీద వసూళ్లు చేస్తున్నారని అన్నారు. ఇప్పటి వరకు ఈ సీఎం ఢిల్లీకి 22 సార్లు పోయాడని, రాష్ట్రంలో మాత్రం ఒక్క కొత్త పథకం కూడా పెట్టలేదని, వందరోజుల్లో అన్ని హామీలు అమలు చేస్తానని చెప్పాడని, మరి ఒక్కటైనా చేశాడా అని ప్రశ్నించారు.

పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలి

పేదవాళ్లకు ఎవరూ అండగా లేరని వారిపై దౌర్జన్యం చేస్తారా? ఆ పేదలే దిక్కులేక నాలాలపై ఇండ్లు కట్టుకుంటారు. మానవత్వం ఉన్న ప్రభుత్వమైతే తొలుత వారికి నోటీసులు ఇవ్వాలి. లేదంటే వారికి వేరే చోట ఇండ్లు ఇవ్వాలి. తెలంగాణలో శిఖం పట్టాలు, ఏక్ ఫస్లా పట్టాలు ఉంటాయి. హైదరాబాద్ పరిధిలో మేం లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టిచ్చినం. అందులో 40 వేల ఇండ్లు ఖాళీగా ఉన్నాయి. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే హైడ్రా బాధిత పేదలకు వాటిని ఇవ్వాలి. – కేటీఆర్

కేసీఆర్ కావాలంటున్నారు

శేరిలింగంపల్లి కార్యకర్తలు బాధపడాల్సిన అవసరం లేదని, శేరిలింగంపల్లిలో ఉప ఎన్నిక వస్తదని, మీ దాంట్లో నుంచే ఒకరు ఎమ్మెల్యే అవుతారని, కొత్తగా ఎవరు రారని కేటీఆర్ పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకులకు ఏ బాధ వచ్చినా ఒక్క ఫోన్‌కాల్‌తో వస్తామని, కొత్తగా కమిటీలు వేసుకుందామని, పార్టీ మారిన వాళ్లు బాధపడుతూ మళ్లీ వస్తామని చెబుతున్నారని, కేసీఆర్ యాదికి వస్తున్నాడని అని ఒక ముస్లిం సోదరుడు మాట్లాడుతున్నాడని తెలిపారు. జేసీబీ వచ్చి ఇండ్లు కొట్టేస్తుంటే కేసీఆర్ నువ్వు రావాలని మరొక సోదరుడు అంటున్నాడని చెప్పారు. రాష్ట్రం మొత్తం మళ్లీ కేసీఆర్ రావాలని కోరుకుంటున్నారని, ఆ సం దర్భం ఎంతో దూరంలో లేదని పేర్కొన్నారు. పదేండ్లు మత కల్లోలాలు లేకుండా, పేదవాళ్లను కడుపులో పెట్టుకొని చూసుకున్నామని చెప్పారు.

హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు ఒక్కసీటు కూడా ఇవ్వలేదనే ఆటోడ్రైవర్లు, బస్తీవాసులు, పేదలపై సీఎం పగబట్టి ఇండ్లు కూల్చేస్తున్నడు. -కేటీఆర్

అధిక పాలసేకరణ ధరతోనే నష్టాలు

పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 24: ఇతర డెయిరీలతో పోలిస్తే విజయ డెయిరీలో పాల సేకరణ ధర కనీసం రూ.పది ఎక్కువగా ఉందని, దానితోనే నష్టాలని రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి పేర్కొన్నారు. సమాఖ్య చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం లాలాపేటలో విజయడెయిరీ ప్రధాన కార్యాలయంలో ఆయన తొలిసారిగా విలేకరులతో మాట్లాడారు. పాడి రైతుల శ్రేయస్సే తన ప్రథమ ప్రాధాన్యమని, విజయ డెయిరీని అగ్రగామిగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇటీవలే రూ.50 కోట్లను విజయ డెయిరీకి మంజూరు చేసిందని, రైతులకు ఉన్న బకాయిలను త్వరలోనే చెల్లిస్తామని చెప్పారు. యాభై ఏళ్లకుపైగా ఉన్న డెయిరీ చరిత్రలో ప్రభుత్వం నుంచి ఒకేసారి రూ.50 కోట్లు సొమ్ము విడుదల కావడం మొదటిసారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, దవాఖానలు, దేవాలయాలు, జైళ్లు, సింగరేణి, ఐసీడీఎస్ తదితర అన్ని ప్రభుత్వ సంస్థలలో విజయ డెయిరీ పాల ఉత్పత్తులే వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించిందని తెలిపారు. తిరుపతి ప్రసాదంలో నెయ్యి వివాదం తలెత్తిన నేపథ్యంలో, తాము నాణ్యమైన నెయ్యిని సరఫరా చేసేందుకు ఆసక్తి వ్యక్తం చేస్తూ టీటీడీ బోర్డుకు లేఖ రాశామని చెప్పారు. రూ.750 కోట్లుగా ఉన్న విజయ డెయిరీ టర్నోవర్‌ను రూ.1500 కోట్లకు పెంచడమే లక్ష్యంగా పనిచేస్తానని మరోసారి స్పష్టంచేశారు.

బకాయిల విడుదల ఉత్తమాటే

ఒక్క పైసా కూడా రైతులకు చెల్లించని వైనం

రేపు ఇందిరాపార్క్ వద్ద పాడి రైతుల ధర్నా

హైదరాబాద్, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ): పాడిరైతులకు మంగళవారం రూ. 50 కోట్ల పాల బకాయిలను చెల్లిస్తామని విజయ డెయిరీ చేసిన ప్రకటన ఉత్తమాటగానే మిగిలిపోయింది. విజయ డెయిరీ ఎండీ ఇచ్చిన మాట ప్రకారం మంగళవారం రాత్రి వరకు నయా పైసా కూడా రైతుల ఖాతాల్లో జమ కాలేదు. పాడి రైతులకు సుమారు 150 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న పాడి రైతులు ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు పిలుపునిచ్చారు. దీంతో దిగొచ్చిన ప్రభుత్వం 50 కోట్లు చెల్లించేందుకు నిర్ణయించింది. ఎలాంటి ఆందోళనలో పాల్గొనవద్దని రైతులకు సూ చించింది. ధర్నాకు రైతులు రాకుండా చేయాలనే కుట్రతో ఈ తప్పుడు ప్రకటన చేశారని పాడిరైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ప్రకటనలు మానుకోవాలని, వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

'మెగా'పై దగా!

మొదటిపేజీ తరువాయి...

విమర్శలు వస్తున్నాయి. మెయింటనెన్స్ నిధులివ్వడం లేదని తెలిసింది.

ప్రైవేటుకు ధారాదత్తం

అత్యంత సాంకేతికతతో నిర్మించిన విజయ మెగా డెయిరీపై పొరుగు రాష్ట్రం పెద్దల కన్ను పడినట్టుగా తెలిసింది. రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదువనా అన్నట్టుగా మెగా డెయిరీని సదరు పెద్దలకు రాసిచ్చేందుకు ప్రయత్నాలను మొదలుపెట్టారు. కుక్కను చంపేముందు పిచ్చిదని ముద్ర వేస్తే దాన్ని చంపడం తేలిక అనే నానుడిని మెగా డెయిరీకి వర్తింప చేస్తున్నట్టుగా తెలిసింది. మెగా డెయిరీ బాగా పని చేస్తే విజయ డెయిరీ కూడా అభివృద్ధిలోకి వస్తుంది. అప్పుడు మెగా డెయిరీని వారికి రాసివ్వడం కుదరకపోవచ్చు. ఈ నేపథ్యంలో మెగా డెయిరీని నిర్లక్ష్యం చేసి అది పని చేయకుండా కుట్రలు చేస్తున్నట్టుగా తెలిసింది. అదే జరిగితే విజయ డెయిరీకి ఉపయోగపడాల్సిన మెగా డెయిరీ భారీ భారమై కూర్చుంటుంది. దీన్ని సాకుగా చూపి నష్టాల్లో ఉందనే సాకుతో తమ వారికి కట్టబెట్టేలా పావులు కదుపుతున్నట్టుగా జోరుగా చర్చ జరుగుతున్నది.

ఇక ఊరూరా లిక్కర్ మాల్స్?

- ప్రతి 14 వేల మందికో దుకాణం
- ఆదాయం పెంచుకోవడం, పార్టీ నేతలను సంతృప్తి పరచడమే లక్ష్యం
- ఒకట్రెండు రోజుల్లో ప్రభుత్వానికి ఎక్సైజ్ నివేదిక?
- ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న మద్యం షాపులు 2,620
- మరో 10,680 దుకాణాల ఏర్పాటుకు సన్నాహాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ): మద్యం ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచుకోవడంతోపాటు అధికార పార్టీ నాయకులను సంతృప్తి పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఎత్తులు వేస్తున్నది. అడిగిందే తడవుగా లేదనకుండా ఏ4 ఎలైట్ మద్యం మాల్స్‌కు లైసెన్స్‌లు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది. ఇప్పటికే ఎక్సైజ్ శాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం మధ్య సమాలోచనలు పూర్తి అయ్యాయి. ఇందుకోసం ఎక్సైజ్ నిబంధనల్లో ఉన్న జాతీయ నిష్పత్తి అనే అంశాన్ని అధికారులు తెరమీదకి తెచ్చారు. ఈ నిష్పత్తిని అమల్లోకి తెస్తే రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా పదివేలకు పైగా మద్యం దుకాణాలు తెరచుకోనున్నాయి. గత ప్రభుత్వం 2023 ఆగస్టులోనే ఏ4 మద్యంషాపులకు లైసెన్స్‌ల జారీ కోసం నోటిఫికేషన్ ఇచ్చి టెండర్లు కూడా ఖరారు చేసింది. గత సంవత్సరం డిసెంబర్ ఒకటో తేదీ నుంచి ఏ4 లైసెన్స్‌లు అమల్లోకి వచ్చాయి. ఇదే నెలలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. కొత్త మద్యం దుకాణాలు తెరవకుండా ఆపడానికి కొత్త ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేసింది కానీ, పాలసీ నిబంధనలు అంగీకరించలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడేనాటికే పాలసీ అమల్లోకి వచ్చింది కాబట్టి, నిబంధనల ప్రకారం 2025 నవంబర్ 31 వరకు పాత పాలసీ అమలులో ఉంటుంది. అప్పటివరకు కొత్తం మద్యం దుకాణాల ఏర్పాటుకు అవకాశం లేదు. దీంతో అధికారం చేతులో ఉండి కూడా మద్యం వ్యాపారం చేసుకోలేకపోతున్నామనే అంతర్మధనం అధికార పార్టీ నాయకుల్లో రోజురోజుకు పెరిగిపోతూ వచ్చింది. ఇదే అంశాన్ని ముఖ్య నేత దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గాలపై కసరత్తు చేయాలని 'ముఖ్య' నాయకుడు ఎక్సైజ్ అధికారులను ఆదేశించినట్టు సమాచారం. నిబంధనలు తిరిగేసిన అధికారులు ఇప్పుడున్న ఎక్సైజ్ చట్టాలప్రకారం ఒక్క దుకాణం కానీ, ఒక్క బార్ కానీ అదనంగా ఇవ్వడానికి అవకాశం లేదని తేల్చి చెప్పినప్పటికీ, తమకు దుకాణాలు ఇవ్వాల్సిందేనని అధికార పార్టీ నేతలు పట్టుబడుతున్నట్టు తెలిసింది.

న్యాయపరమైన చిక్కులు లేకుండా..

ఈ నేపథ్యంలో అధికారులు ఎక్సైజ్ నిబంధనల్లో ఉన్న జాతీయ నిష్పత్తి అంశాన్ని తెర మీదకు తెచ్చారు. దీని ప్రకారం ప్రతి 14 వేల మంది జనాభాకు ఒక మద్యం దుకాణాలు ఏర్పాటు చేయొచ్చని ఎక్సైజ్ అధికారులు నిర్ధారించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ పాలసీని రూపొందించాల్సిన అవసరం కానీ, క్యాబినెట్ సబ్ కమిటీ ఆమోదం కానీ అవసరం లేకుండా నేరుగా మద్యం దుకాణాలను అనుమతించవచ్చు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర జనాభా 3.5 కోట్లు. ఈ లెక్కల ప్రకారం 13,300 మద్యం దుకాణాల ఏర్పాటుకు అర్హత ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 2,620 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇవి పోనూ కొత్తగా 10,680 మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడానికి అవకాశం ఉన్నట్టు ఎక్సైజ్ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి ఒక రహస్య నివేదిక ఇచ్చినట్టు సమాచారం. ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం న్యాయ సలహా కోసం పంపగా వారు కొన్ని సూచనలు చేసినట్టు తెలిసింది.

- బెల్ట్ షాపులు బంద్ చేయాలంటూ ధర్నా

బెల్టు షాపులు బంద్ చేయాలని డిమాండ్ చేస్తూ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం కోసిని గ్రామ మహిళలు మంగళవారం ప్రధాన రోడ్డుపై ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రమేశ్, పోలీసు అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామస్థులు, బెల్టు షాపు నిర్వాహకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. – కాగజ్‌నగర్

ఎక్సైజ్ లక్ష్యం 45 వేల కోట్లు

మరోవైపు, గతంలో ఎక్సైజ్‌శాఖ ఆదాయ వనరుల సమీకరణపై ఏర్పాటైన మంత్రివర్గం ఉపసంఘం నిధులు ఎలా పెంచాలనే అంశంపై సుదీర్ఘంగా చర్చించింది. ఆరు గ్యారెంటీలకు సంబంధించిన నిధులు కూడా మద్యం నుంచే రాబట్టాలని ఎక్సైజ్ అధికారులకు దిశా నిర్దేశం చేసినట్టు తెలిసింది. ప్రస్తుతం రాష్ట్రంలో 2,620 ఏ4 మద్యం దుకాణాలు, 1,200 బార్లు, క్లబ్బులు ఉన్నాయి. వీటి ద్వారా మద్యం క్రయ విక్రయాలు, అన్ని రకాల సుంకాలు కలుపుకొని రాష్ట్ర ఖజనాకు 2022లో రూ.32 వేల కోట్లు, 2023లో రూ.35 వేల కోట్ల ఆదాయం సమకూరింది. ప్రభుత్వం ఈ లక్ష్యాన్ని అదనంగా రూ.10 వేల కోట్లకు పెంచి.. రూ.45 వేల కోట్లు రాబట్టాలని మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది.

సీఎం ఇలాకాలో బాలికల అవస్థలు

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం కుదురుమల్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లను నిర్మించారు. బిల్లు మంజూరు కాలేదని కాంట్రాక్టర్ మంగళవారం మరుగుదొడ్లకు తాళం వేయడంతో విద్యార్థినులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సీఎం ఇలాకాలో ఈ దుస్థితి నెలకొనడంపై విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

– కొడంగల్

ధాన్యం దించుకోం!

ప్రభుత్వానికి మిల్లర్ల అల్టిమేటం

- అన్ని జిల్లాల్లో కలెక్టర్లకు వినతిపత్రాలు
- సన్న ధాన్యంతో 67% సీఎంఆర్ ఇవ్వలేం
- మిల్లులపై దాడులు, వేధింపులు ఆపాలి
- సమస్యల పరిష్కారానికి మిల్లర్ల డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ): రైతుల నుంచి వానకాలం ధాన్యం కొనుగోలుకు ఇబ్బందులు తప్పేలా లేవు. సివిల్ సప్లై సేకరించిన ధాన్యాన్ని మిల్లుల్లో దించుకోబోమని రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. సన్న బియ్యం సీఎంఆర్, బకాయిలతో పాటు వేధింపుల సమస్యలు పరిష్కరించే వరకు ఎట్టిపరిస్థితుల్లోనూ ధాన్యం తీసుకోబోమని స్పష్టంచేశారు. ఈ మేరకు అన్ని జిల్లాల్లో రైస్ మిల్లర్ల అసోసియేషన్ తరుపున కలెక్టర్లకు వినతిపత్రాలు అందిస్తున్నారు. ఇప్పటికే తమ సమస్యలను సివిల్ సప్లై ఉన్నతాధికారులకు విన్నవించామని, కానీ ఎలాంటి పరిష్కారం లభించలేదని మిల్లర్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ధాన్యం దించుకోవద్దనే నిర్ణయానికి వచ్చినట్టుగా చెబుతున్నారు. మిల్లర్ల అల్టిమేటం నేపథ్యంలో అక్టోబర్ మొదటివారం నుంచి ప్రారంభమయ్యే కొనుగోలుపై ప్రభావం చూపే అవకాశం ఉంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ధాన్యం కొనుగోళ్లు కష్టమేనని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నా యి.

67శాతం సీఎంఆర్ ఇవ్వలేం

సన్నధాన్యం దించుకోవడం, సన్నధాన్యానికి 67శాతం సీఎంఆర్ ఇవ్వడంపై మిల్లర్లు ప్రధానంగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ సీజన్ నుంచి సన్న ధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. జనవరి నుంచి రేషన్‌లో సన్నబియ్యం పంపిణీ చేస్తామని కూడా హామీ ఇచ్చింది. ఇక్కడే అసలు సమస్య ప్రారంభమైంది. రైతుల నుంచి సేకరించిన సన్న ధాన్యాన్ని సివిల్ సప్లై మిల్లర్లకు ఇస్తుంది. నిబంధనల ప్రకారం మిల్లర్లు సన్నధాన్యం రా రైస్‌కు 67శాతం సీఎంఆర్(100 కిలోల ధాన్యానికి 67కేజీల బియ్యం) ఇవ్వాలి. కానీ సన్న ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే 55–58 కేజీలు మాత్రమే బియ్యం వస్తాయని మిల్లర్లు చెబుతున్నారు. మిగిలిన 9 నుంచి 12 కేజీల సన్న బియ్యంను తాము ఏ విధంగా ఇవ్వాలని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో 17శాతం తేమతో సన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తారని, 45 రోజులకు మించి నిల్వ చేయలేమని చెబుతున్నారు.

రైస్ మిల్లులపై సివిల్ సప్లై దాడులు

జనగామ, సెప్టెంబర్ 24 (నమస్తేతెలంగాణ)/గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని అప్పరాజుపల్లి, జనగామలోని దేవరుప్పుల మండలం మన్‌పహాడ్‌పల్లిలోని రైస్ మిల్లులపై సివిల్ సప్లై అధికారులు మంగళవారం దాడులు జరిపారు. ఈ దాడుల్లో మొత్తం రూ.14.67 కోట్ల సీఎంఆర్ గల్లంతైనట్టు గుర్తించి, క్రిమినల్ కేసులకు సిఫారసు చేశారు. అప్పరాజులపల్లి శ్రీరాజరాజేశ్వరి మిల్లులో సివిల్ సప్లై అధికారులతోపాటు గూడూరు తహసీల్దార్, టాస్క్‌ఫోర్స్ ఎస్సైలు తనిఖీ చేసి రూ.9 కోట్ల 56 లక్షల 73 వేల ధాన్యం దుర్వినియోగమైనట్టు ప్రాథమికంగా గుర్తించారు. మన్‌పహాడ్ శ్రీసాయిరాం మాడ్రన్ బిన్నీ రైస్‌మిల్లులో రూ.5.67 కోట్ల విలువైన 1,774.071 మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్లింగ్‌ను దారి మళ్లించినట్టు తేల్చారు. జిల్లా అధికారుల తనిఖీలో రైస్ మిల్లుల్లో ధాన్యం నిల్వలు మాయమైనట్టు తేలడంతో యజమాని పీ చంద్రశేఖర్‌రెడ్డిపై మంగళవారం దేవరుప్పుల పోలీస్ స్టేషన్‌లో అధికారులు ఫిర్యాదు చేశారు. రైస్ మిల్లర్, అతని కుటుంబసభ్యుల పేరిట ఉన్న ఆస్తులపై లావాదేవీలను అనుమతించవద్దని జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లకు లేఖ రాశారు. దాడుల్లో టీసీఎస్‌వో ప్రేమ్‌కుమార్, జిల్లా సివిల్ సప్లై అధికారి కృష్ణవేణి, తహసీల్దార్ శ్వేత, ఏఎస్‌వో రమేశ్, టాస్క్‌ఫోర్స్ ఎస్సై కృష్ణ, ఆర్ఐ మల్లయ్య పాల్గొన్నారు.